aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

బుధవారం
4-11-2026

సంపుటి : 01 సంచిక : 222 పేజీలు : 08 వెల : ₹ 5/-

తెలుగు దినపత్రిక

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

ముఖ్యమంత్రులను విమర్శించే
హక్కు పౌరులకు ఉంది!

- ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించడం పౌరుల హక్కు
- ప్రభుత్వాన్ని ప్రశంసించే స్వేచ్ఛతోపాటు విమర్శించే హక్కూ ఉంది
- పౌరుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, పోలీసులదే
- విమర్శలు చేసినంత మాత్రాన ప్రసంగం నేరం కాదని స్పష్టీకరణ
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచన
- మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు


03

భూమిపైకి దూసుకొస్తున్న
నాసా టెలిస్కోప్

- నేడు భూ వాతావరణంలోకి ప్రవేశించనున్న స్విఫ్ట్ అబ్జర్వేటరీ
- భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రవేశించే అవకాశం
- టెలిస్కోప్‌లోని అధిక భాగం వాతావరణంలోనే దహనం
- ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై పరిసరాల్లో శకలాలు పడే అవకాశం
- 1,500 కిలోల బరువున్న అంతరిక్ష టెలిస్కోప్
- భూమిపై నష్టం జరిగే ప్రమాదం చాలా స్వల్పమంటున్న శాస్త్రవేత్తలు


03

మహారాష్ట్రతో నిరంతరం
సంప్రదించండి

తమ్మిడిహట్టిపై ఆ రాష్ట్రం కోరిన సమాచారమివ్వండి



- ముంపు భూములపై సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచన
- పరిహారం చెల్లింపునకు తెలంగాణ ప్రభుత్వం సుముఖం
- అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో జమ చేసేందుకు సిద్ధం
- మహారాష్ట్ర నిర్వహించే భూముల సర్వేకు అభ్యంతరం లేదని స్పష్టీకరణ
- గతంలో కుదిరిన ఒప్పందాలు, సాంకేతిక పత్రాలు అందజేయాలని ఆదేశం
- అంతర్రాష్ట్ర సమస్యల పరిష్కారానికి ముందస్తు కార్యాచరణ
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: నవంబర్ 3 మహాప్రభ
తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజ్ నిర్మాణం వల్ల మహారాష్ట్ర పరిధిలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిగిన చర్చల పురోగతి, ఇరు రాష్ట్రాల మధ్య పరిష్కరించాల్సిన అంశాలు, ముంపు భూముల వివరాలు, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులపై అధికారులతో చర్చించారు. తుమ్మిడిహట్టి -మిగతా 3 లో


03

నిరసన ప్రదేశాన్ని నిరవధికంగా
ఆక్రమించుకోలేరు

- ఇతరులకూ నిరసన తెలిపే అవకాశం కల్పించాలి
- ఢిల్లీ వ్యాపారుల పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- నిరసన హక్కుతోపాటు జీవనోపాధి హక్కునూ కాపాడాలి
- నిరసనలకు నిర్దిష్ట సమయం కేటాయించాలని సూచన
- అనుమతుల ఉత్తర్వుల్లో నిబంధనలు, షరతులు స్పష్టంగా ఉండాలి
- ప్రభుత్వం, ఢిల్లీ పోలీసుల నుంచి వివరణ కోరిన ధర్మాసనం

'ప్రళయ్' క్షిపణి పరీక్ష
విజయవంతం


03



మూడు జిల్లాలకు
రెడ్ అలర్ట్

- భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు అతి భారీ వర్ష సూచన
- మహబూబాబాద్‌కు ఆరెంజ్ అలర్ట్.. ఉమ్మడి వరంగల్, యాదాద్రి, నల్గొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్
- గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- బుధవారం అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక
- ఏపీలో మురసు తుపాను బీభత్సం.. జనజీవనం అస్తవ్యస్తం
- చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలి రవాణా వ్యవస్థకు అంతరాయం
- మూడు లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం

హైదరాబాద్:నవంబర్ 3 మహాప్రభ
మురసు తుపాను ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం -మిగతా 3 లో



తెలంగాణలో అధికారంపై బీజేపీవి
పగటి కలలు

- అమిత్ షా వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శ
- 'సర్' పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- కాళేశ్వరం అవినీతిపై ఆధారాలిచ్చినా కేంద్రం చర్యలు తీసుకోలేదని విమర్శ
- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య
- తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని వ్యాఖ్య
- రాహుల్‌గాంధీ ప్రధాని కాగానే దేశవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తామని వెల్లడి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి నవంబర్ 3 మహాప్రభ
వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు పగటి కలలేనని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎద్దేవా చేశారు. ఖమ్మం జిల్లా దమ్మాయిగూడెంలో 187 మందికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని 'సర్' (ఓటర్ల జాబితా సమగ్ర సవరణ) పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని బీజేపీపై ఆరోపణలు చేశారు. తెలంగాణ నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ వెళ్తోందంటూ చేస్తున్న ఆరోపణలు విద్దూరంగా ఉన్నాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు -మిగతా 3 లో

మోదీజీ.. బహిరంగ చర్చకు సిద్ధమా?

- ప్రతిపక్షాలను దేశద్రోహులుగా చిత్రించడంపై రాహుల్ గాంధీ సవాల్
- ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని ప్రకటన
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను న్యాయనిర్ణేతగా నియమించినా అభ్యంతరం లేదని వ్యాఖ్య
- విదేశీ సంబంధాల ఆరోపణలపై ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్
- అమెరికా ఒప్పందం, అదానీ కేసు, ఎప్‌స్టీన్ అంశాలపైనా చర్చకు సిద్ధమన్న రాహుల్
- కాంగ్రెస్ నేత సవాల్‌పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కౌంటర్


03

సర్ వద్దంటే వీపులు సాఫే!



ఓటర్ల జాబితాలో ఇప్పటికీ ఇందిర, పీవీల పేర్లు

- మరణించిన వారి పేర్లు తొలగించాలన్నా కాంగ్రెస్ నేతల అభ్యంతరాలా?
- సర్ ప్రక్రియను అడ్డుకునే వారిని ఉపేక్షించొద్దని బండి సంజయ్ వ్యాఖ్య
- ఇటలీ సంతతికి చెందిన వారు ప్రధాని పదవి కోసం కలలు కంటున్నారని విమర్శ
- నిర్మల్‌లో రెండు కిలోమీటర్ల మేర బీజేపీ మహాపాదయాత్ర
- కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల సోషల్ మీడియా ట్రోలింగ్‌పై ఆగ్రహం
- తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా
- నిర్మల్‌లో బీజేపీ పాదయాత్రలో నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్

ఉమ్మడి ఆదిలాబాద్, నవంబర్ 3 మహాప్రభ
ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అడ్డుకునే వారిని ఉపేక్షించకూడదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న వారి వీపులు సాఫ్ చేయాలని వ్యాఖ్యానించారు. దశాబ్దాల కిందట మరణించిన మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు పేర్లు ఇప్పటికీ ఓటర్ల జాబితాలో ఉన్నాయని, మరణించిన వారి పేర్లను తొలగించాలంటే కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడం విద్దూరంగా ఉందని విమర్శించారు. సర్ ప్రక్రియకు మద్దతుగా -మిగతా 3 లో


03

కాలపరీక్షకు తట్టుకున్న
భారత్--రష్యా స్నేహం

- బయటి శక్తులు ఇరు దేశాల మధ్య బంధాన్ని ప్రభావితం చేయలేవు
- శతాబ్దాల నాటి ప్రజా సంబంధాలే ద్వైపాక్షిక స్నేహానికి పునాది
- గాంధీ--టాల్‌స్టాయ్ లేఖల అనుబంధాన్ని గుర్తుచేసిన రష్యా ప్రతినిధి
- భారత్‌లో రష్యన్ సంస్కృతికి, రష్యాలో భారతీయ సినిమాలకు ఆదరణ
- 80 ఏళ్ల దౌత్య సంబంధాల సందర్భంగా సాంస్కృతిక వేడుకలకు ప్రణాళిక

దియా మీర్జా వీడియోను తిరిగి అప్‌లోడ్ చేయండి
03

ఇరాన్‌పై మళ్లీ దాడులు

ఖేష్మ్ ద్వీపంపై అమెరికా క్షిపణుల వర్షం



వాషింగ్టన్ నవంబర్ 3 మహాప్రభ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పెరిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హొర్ముజ్ జలసంధిలో ఇరాన్‌కు చెందిన లక్ష్యాలపై అమెరికా దాడులు జరిపింది. ఈ విషయాన్ని అమెరికా అధికారి ఒకరు వెల్లడించినట్టు అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. అమెరికాలో మధ్యంతర ఎన్నికలు జరుగుతున్న వేళ ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. అయితే ఇవి పరిమిత స్థాయిలోనే జరిగిన సైనిక చర్యగా భావిస్తున్నారు. ఇరాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం.. ఖేష్మ్, హెంగామ్ దీవులతోపాటు సమీపంలోని ప్రధాన భూభాగ ప్రాంతమైన బందర్ అబ్బాస్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి.గతంలో జరిగిన దాడుల మాదిరిగా ఈసారి అమెరికా ముందుగా ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రకటించారు. అయితే, ఇప్పుడు దాడులు జరగడం ఆయన వైఖరిలో మార్పునకు సంకేతంగా కనిపిస్తున్నది. ఇరాన్‌తో యుద్ధం, దాని ప్రభావంతో అమెరికాలో పెరిగిన పెట్రోల్ ధరలు, ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారం.. కాంగ్రెస్‌పై పట్టు నిలుపుకోవాలని భావిస్తున్న ట్రంప్, రిపబ్లికన్ పార్టీకి ప్రతికూలంగా మారాయి.

10 లక్షల మంది స్వచ్ఛంద సైనికులకు ఇరాన్ శిక్షణ

అమెరికాతో ఘర్షణలు మళ్లీ తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇరాన్ తన సైనిక సన్నద్ధతను పెంచుతున్నది. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది పారామిలిటరీ స్వచ్ఛంద కార్యకర్తలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా సోమవారం టెహ్రాన్‌లో మూడో సైనిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్‌కు అనుబంధంగా పనిచేసే బసీజ్ పారామిలిటరీ దళ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వారం నుంచే దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో 1500 శిక్షణ కేంద్రాలు పనిచేయడం ప్రారంభిస్తాయని బసీజ్ శిక్షణ విభాగం డిప్యూటీ అధిపతి అలీ కౌసారీ తెలిపారు.

ఒమన్‌లో భారత నౌకపై దాడి.. గుజరాత్ వాసి

మన దేశ పతాకంతో వస్తున్న ఒక వాణిజ్య నౌకపై ఒమన్ తీరంలో సోమవారం జరిగిన దాడిలో ఒక భారతీయుడు మరణించాడని ఒమన్ విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో ఉన్న 14 మంది భారతీయుల్లో 13 మందిని ఒమన్ కోస్ట్‌గార్డు రక్షించిందని పేర్కొంది. ఎంఎస్‌వీ ఏఎల్ జేయూఎస్‌యూఎఫ్ఐ పేరుగల వాణిజ్య నౌకపై ఒమన్‌లో లిమ్హా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వైమానిక దాడి జరిపారని కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా శాఖ మంత్రి శర్బానాద సోనావాల్ తెలిపారు. ఈ దాడిలో గుజరాత్‌కు చెందిన గాంధార్ నహీమ్ అజిత్ మరణించాడని పేర్కొంటూ ఆయన కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ దాడిపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

-31 మంది దుర్మరణం

-48 మంది గల్లంతు, 62 మందికి గాయాలు



కీవ్ నవంబర్ 3 మహాప్రభ

ఉక్రెయిన్‌లోని కొమిషువకాలోని ఓ స్కూల్ భవనంపై రష్యా సోమవారం తొమ్మిది బాంబులు వేయడంతో కనీసం 31 మంది దుర్మరణం చెందారు. 48 మంది గల్లంతయ్యారు. ఈ భవనాన్ని షెల్టర్‌గా, మానవతా సాయం పంపిణీ కేంద్రంగా వాడుతున్నట్టు స్థానిక గవర్నర్ సెమికిన్ తెలిపారు. ఈ దాడిని అత్యంత భయానకమైనదిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభివర్ణించారు. అమెరికా మధ్యంతర ఎన్నికలు జరుగుతున్న తరుణంలో కాల్పుల విరమణ పాటించాలన్న అమెరికా సూచన పెడచెవిన పెట్టి రష్యా ఈ దాడులకు పాల్పడిందని విమర్శించారు.అంతకు ముందు తమ దేశ ఇంధన మౌలిక సదుపాయాలే లక్ష్యంగా రష్యా వందలాది డ్రోన్లు, డజన్ల కొద్దీ శక్తివంతమైన క్రూయిజ్, ఖండాంతర క్షిపణులను ప్రయోగించిందని ఆయన వెల్లడించారు. 'మా గగనతలాన్ని రక్షించుకోవడానికి సహాయం కావాలి. లేకపోతే రష్యా తన క్షిపణి దాడులను ఎప్పటికీ ఆపదు. నిజాయితీగా శాంతిని నెలకొల్పడంలో సహాయం అత్యవసరం.

అమెరికా ఆ పని చేయగలదు' అని ఆయన వ్యాఖ్యానించారు. ఖర్కీవ్‌పై జరిగిన మరో దాడిలో కనీసం 62 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు. మంగళవారం ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో దవాఖానలపై రష్యా దాడులు చేసింది. మరోవైపు సోమవారం రాత్రి 856 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్టు రష్యా రక్షణ మంత్రి తెలిపారు. ఇందులో 493 డ్రోన్లు రాజధాని మాస్కోపై ప్రయోగించారని నగర మేయర్ సబ్యనిన్ వెల్లడించారు.

దుబాయ్‌లో పార్కులోనే ఆఫీసు



దుబాయ్: నవంబర్ 3 మహాప్రభ

ఉద్యోగమంటే నాలుగు గోడల మధ్య కూర్చుని పనిచేయడమే కాదు.. ప్రకృతి ఒడిలోనూ హాయిగా విధులు నిర్వహించవచ్చు. ఈ వినూత్న ఆలోచనకు దుబాయ్ శ్రీకారం చుట్టింది. తొలిసారిగా 'వర్క్ ఫ్రమ్ పార్క్' కేంద్రాన్ని ప్రారంభించింది. అల్ బర్షా పాండ్ పార్క్‌లో నవంబర్ 2న అందుబాటులోకి వచ్చిన ఈ కేంద్రంలో చెట్ల మధ్య ఉచితంగా పనిచేసుకోవచ్చు.ఏసీతో కూడిన ఇండోర్ వర్క్ స్పేస్‌లను రోజుకు 50 దిర్హామ్‌ల నుంచి వినియోగించుకోవచ్చు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవి పనిచేస్తాయి. కుటుంబ సభ్యులతో పార్క్‌కు వస్తూనే ఉద్యోగం చేసుకునే అవకాశం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత.

మూడు దశాబ్దాలు.. 31 వేల మైళ్ల సాహసయాత్ర



లండన్ నవంబర్ 3 మహాప్రభ

సుమారు మూడు దశాబ్దాల కాలం.. 31 వేల మైళ్ల సుదీర్ఘ ప్రయాణం.. ప్రపంచ యాత్ర చేసిన బ్రిటీష్ సాహసికుడు కార్ల్ బుష్బీ సొంత ఇంటికి చేరుకోవడంతో ఆయనకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. 28 ఏండ్ల వయసులో ప్రయాణాన్ని ప్రారంభించిన బుష్బీ 57 ఏండ్ల వయసులో 28 ఏండ్ల తర్వాత హల్ నగరంలోని సోమవారం తన గృహానికి చేరుకున్నారు.వందలాదిమంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. కుమారుడిని చూసి ఆయన తల్లి తీవ్ర ఉద్వేగంతో ఆలింగనం చేసుకుంది. ఆమెతో పాటు ఆయన 36 ఏండ్ల కుమారుడు, 12 ఏండ్ల మనవరాలు ఆయనను చూసి ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అడవులు, ఎడారులు, గడ్డకట్టిన భూభాగాలు, ప్రపంచంలోని అత్యంత కఠినమైన సరిహద్దుల గుండా సాగుతూ ప్రపంచ వ్యాప్తంగా 31 వేల మైళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని ఆయన పూర్తి చేశారు.

రెండు హెలికాప్టర్లు ఢీ.. భారతీయుడి మృతి



కాఠ్మాండూ, నవంబర్ 3 మహాప్రభ

ల్యాండింగ్ అవుతుండగా, రెండు హెలికాప్టర్లు ఢీకొని ఒక భారతీయుడు మరణించగా, ముగ్గురు గాయపడిన ఘటన నేపాల్‌లో జరిగింది. సోలుకుంబు జిల్లా కుంబు పసాంగ్ లాము రూరల్ మున్సిపాల్టీ పెహెరిచేలోని నాలుగో వార్డులో మంగళవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫిష్‌టైల్ ఎయిర్, ఎయిర్ డైనస్టీలకు చెందిన రెండు హెలికాప్టర్లు ల్యాండింగ్ అవుతుండగా, ఒకదానిని మరొకటి ఢీకొనడంతో ఫిష్‌టెయిల్ హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న వసంత్ కుమార్ బలరామరామడు అనే భారతీయుడు మరణించారు.అలాగే భారతీయ సంతతికి చెందిన న్యూజిలాండ్ వాసి శైలేష్ కృష్ణ గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం మరో హెలికాప్టర్ ద్వారా కాఠ్మాండూకు తరలించారు. ఈ ఘటనలో నేపాల్ పైలట్లు రవీంద్ర ప్రజాపతి, ప్రజ్వల్ కేసీలు గాయపడ్డారు. పెహెరిచే ప్రాంతం ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు వెళ్లే మార్గంలో కాఠ్మాండూకు 150 కి.మీ ఈశాన్యంలో ఉంది.

ఎన్‌సీకి షాక్.. పార్టీకి శ్రీనగర్ ఎంపీ రాజీనామా



శ్రీనగర్: నవంబర్ 3 మహాప్రభ

జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాకు రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలింది. అధికార నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన శ్రీనగర్ ఎంపీ ఆగా సయ్యద్ రుహుల్లా మెహదీ పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. మంగళవారం బుద్గాంలో జరిగిన బహిరంగ సభలో ఈ విషయాన్ని వెల్లడించారు.2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆయన కొంతకాలంగా విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఆర్టికల్ 370 పునరుద్ధరణ, జమ్ముకశ్మీర్ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, ఖైదీల విడుదల వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

ఫామ్ 6తో మళ్లీ ఓటరుగా నమోదు!

ఓటు పోయిందన్న భయాందోళన వద్దు

పాత ఓటర్లకు ఎన్నికల సంఘం సూచన

న్యూఢిల్లీ: ' నవంబర్ 3 మహాప్రభ

సర్' ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేకపోతే గతంలో నమోదైన ఓటర్లు మళ్లీ నమోదు కావడానికి ఫామ్ 6ను సమర్పించవచ్చని ఈసీఐ మంగళవారం తెలిపింది. ముసాయిదా సర్ జాబితాల నుంచి తమ పేర్లు తొలగించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం నుంచి స్పష్టీకరణ వెలువడింది. ఫామ్ 6ను సమర్పించడం అంటే తాను మొదటిసారిగా ఓటర్ల జాబితాలో చేరాలని కోరుకుంటున్నట్లు డిక్లరేషన్ ఇవ్వడం.ఒకవేళ అది అబద్ధపు డిక్లరేషన్ అయితే ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద విచారణకు లేదా చర్యలకు దారితీయవచ్చు. ప్రస్తుతం జరుగుతున్న సర్ ప్రక్రియలో ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు లేని కొందరు వ్యక్తులు ఫామ్ 6ని సమర్పించడానికి సంకోచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు రాసిన లేఖలో ఈసీ పేర్కొంది. దీనికి కారణం తమ పేరు మొదటిసారిగా ఓటర్ల జాబితాలో చేర్చబడుతున్నదని ఒక నిర్దిష్ట ప్రకటనను(డిక్లరేషన్) సమర్పించాల్సి ఉంటుంది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని ఓటర్లు గతంలో నమోదు చేసుకున్నప్పటికీ తుది ఓటర్ల జాబితాలో తమ పేర్లను కొత్తగా చేర్చడానికి ఫామ్ 6ను సమర్పించవచ్చని ఈసీ స్పష్టం చేసింది.

సర్' ట్రిబ్యునల్ జడ్జీలకు ఈసీ ఝలక్!

మీ గుర్తింపు నిరూపించుకోండంటూ కొత్త నిబంధనలు

సెప్టెంబర్ 21 నుంచి ఆగిపోయిన ఓటర్ల అప్పీళ్లు



కోల్‌కతా: నవంబర్ 3 మహాప్రభ

ఆధార్ ధృవీకరణ ఫీచర్‌పై పశ్చిమ బెంగాల్ ప్రత్యేక సమగ్ర సమీక్ష(సర్) అప్పిలేట్ ట్రిబ్యునల్ న్యాయమూర్తులు ఎన్నికల సంఘం పోర్టల్‌లోకి లాగిన్ అవ్వడానికి నిరాకరించి నెలరోజులు దాటింది. ఈ నేపథ్యంలో న్యాయమూర్తులు వారి పాన్‌కార్డ్, ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఉపయోగించి డిజిటల్ సంతకాల సర్టిఫికెట్లను సృష్టించుకోవాలని ఎన్నికల సంఘం గత వారం కోరినట్టు 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వెల్లడించింది.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నియమితులైన న్యాయమూర్తులు ఆధార్ ధ్రువీకరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ సెప్టెంబర్ 24న పశ్చిమ బెంగాల్ అదనపు ప్రధాన ఎన్నికల అధికారి(ఏసీఈవో)కి లేఖ రాశారు. ఎన్నికల సంఘం డైరెక్టర్ జనరల్(ఐటీ) సీమా ఖన్నా పోర్టల్ అప్‌డేట్‌ల గురించి న్యాయమూర్తులకు ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత సెప్టెంబర్ 21న ఈ ఫీచర్‌ను తిరిగి చేర్చారు. గత వారం ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) కార్యాలయం ఒక ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా డిజిటల్ సంతకాల సర్టిఫికెట్లను ఏర్పాటు చేసుకోవాలని న్యాయమూర్తులను కోరింది. అప్పీళ్ల పరిష్కారం కోసం ఏటీ పోర్టల్ నుంచి ఆధార్ ధ్రువీకరణ స్క్రీన్‌ను తొలగించాలని అప్పిలేట్ ట్రిబ్యునల్‌లోని న్యాయమూర్తులు కోరుతున్నారని పేర్కొంటూ సెప్టెంబర్ 24న ఏసీఈవోకి ట్రిబ్యునల్స్ వేదిక-ఇన్‌చార్జ్ లేఖ రాశారు. అప్పటి నుంచి న్యాయమూర్తులు పోర్టల్‌లోకి లాగిన అవ్వడం లేదా అప్పీళ్లను పరిష్కరించడం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

5న బెంగళూరులో ఇండియా కూటమి నిరసన

న్యూఢిల్లీ, నవంబర్ 3 మహాప్రభ

సర్‌కు వ్యతిరేకంగా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి మరో ఆందోళనకు సిద్ధమవుతున్నది. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో మొదటి నిరసన ముగియడంతో ఈసారి నవంబర్ 5న బెంగళూరు ఫ్రీడమ్ పార్క్‌లో భారీగా ఆందోళన నిర్వహించాలని నిర్ణయించింది.కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ మంగళవారం ఈ విషయాన్ని వెల్లడించారు. కూటమిలోని భాగస్వాములైన సీపీఐ(ఎం), ఫార్వర్డ్ బ్లాక్, సమాజ్‌వాదీ పార్టీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్‌లు ఈ ఆందోళనలో పాల్గొనేందుకు అంగీకరించాయని చెప్పారు.



ముఖ్యమంత్రులనువిమర్శించే హక్కు పౌరులకు ఉంది!



న్యూఢిల్లీ:
ముఖ్యమంత్రులను విమర్శించే హక్కు పౌరులకు ఉందని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించడం, వారి విధానాలను విమర్శించడం, తమ వ్యతిరేకతను వ్యక్తం చేయడం పౌరుల ప్రాథమిక హక్కులని పేర్కొంది. ప్రజలకు ఉన్న ఈ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు పోలీసులపై కూడా ఉందని వ్యాఖ్యానించింది. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను కించపరిచారనే ఆరోపణలతో డీఎంకే కౌన్సిలర్ సుధపై కేసు నమోదైంది. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆమె ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ సందర్భంగా జస్టిస్ ఎన్. రమేశ్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సుధకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శల ప్రాధాన్యాన్ని వివరించింది. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాన్ని ప్రశంసించే స్వేచ్ఛ ప్రజలకు ఉన్నట్టే, విమర్శించే హక్కు కూడా ఉంటుందని కోర్టు పేర్కొంది. పాలన మారవచ్చని, ముఖ్యమంత్రులు మారవచ్చని, కానీ చట్టం ముందు అందరూ సమానులనే సూత్రం మాత్రం మారదని స్పష్టం చేసింది. పాలకులను ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియగా అభివర్ణించింది. ఒక రాజకీయ నాయకుడి ప్రసంగం పాలకులను అవమానించేలా ఉందన్న కారణంతోనే దాన్ని నేరంగా పరిగణించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. ముఖ్యమంత్రితో సహా ప్రజాజీవితంలో ఉన్న నేతలందరూ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కలిగి ఉంటారని తెలిపింది. పాలకులు విమర్శలకు అతీతులు కారని పేర్కొంటూ, చట్టాన్ని అమలు చేసే పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించింది.

భూమిపైకి దూసుకొస్తున్న నాసా టెలిస్కోప్



వాషింగ్టన్:
అంతరిక్ష పరిశోధనల్లో కీలక పాత్ర పోషించిన అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ టెలిస్కోప్ భూమివైపు దూసుకొస్తోంది. సుమారు 1,500 కిలోల బరువున్న ఈ అంతరిక్ష టెలిస్కోప్ బుధవారం (నవంబర్ 4) భూ వాతావరణంలోకి ప్రవేశించి కూలిపోనుంది. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో వాతావరణంలోకి ప్రవేశించే అవకాశం ఉందని నాసా అంచనా వేస్తోంది. అయితే ఈ సమయానికి సుమారు 11 గంటల వరకు మార్పు ఉండవచ్చని వెల్లడించింది. వాతావరణంలోకి ప్రవేశించే సమయంలో టెలిస్కోప్‌లోని అధిక భాగం తీవ్ర ఉష్ణోగ్రతలకు గురై మండిపోనుంది. అయితే కొన్ని విడిభాగాలు పూర్తిగా దహనం కాకుండా భూమిని చేరే అవకాశముందని నాసా తెలిపింది. ఈ శకలాలు ఎక్కడ పడతాయన్న దానిపై ప్రస్తుతం అంచనాలు కొనసాగుతున్నాయి. నాసా అంచనాల ప్రకారం ఆఫ్రికా, ఆస్ట్రేలియా, భారత్, ఆగ్నేయాసియా, మధ్య, దక్షిణ అమెరికాలోని కొన్ని ప్రాంతాలు ఈ టెలిస్కోప్ తిరిగి వాతావరణంలోకి ప్రవేశించే విస్తృత పరిధిలో ఉన్నాయి. భారతదేశంలో ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలు కూడా ఈ ప్రాంత పరిధిలోకి వస్తున్నాయి. అయితే జనావాసాలపై శకలాలు పడే ప్రమాదం చాలా స్వల్పమని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

నిరసన ప్రదేశాన్ని నిరవధికంగా ఆక్రమించుకోలేరు



న్యూఢిల్లీ, నవంబర్ 3
నిరసనల పేరుతో ఒక ప్రదేశాన్ని నిరవధికంగా ఆక్రమించుకుని ఉండటానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ఇతరులకు కూడా తమ సమస్యలను వ్యక్తం చేసుకునే అవకాశం కల్పించాలని అభిప్రాయపడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన నిరసనల కారణంగా దుకాణాలు మూతపడి కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొంటూ వ్యాపారుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు, ఇతర సంబంధిత అధికారుల నుంచి సమాధానాలు కోరింది. సామూహిక నిర్బంధాలు, పోలీసుల క్రూరత్వం, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత వంటి అంశాలపై దాఖలైన పిటిషన్లను కూడా ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా నిరసన తెలిపే హక్కును, ప్రజల జీవనోపాధి హక్కును సమతుల్యం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. ఒక ప్రదేశాన్ని ఎల్లవేళలా ఆక్రమించుకుని ఉండలేరని, అలా చేస్తే రైతులు, జర్నలిస్టులు సహా ఇతరులు ఎక్కడికి వెళతారని ప్రశ్నించింది. నిరసనలకు నిర్దిష్ట సమయాన్ని కేటాయించాలని సీజేఐ సూచించారు. నిరసన ప్రదర్శనలకు అనుమతులు ఇచ్చే సమయంలో విధించే నిబంధనలు, షరతులను సంబంధిత ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొనాలని అధికారులను ఆదేశించారు. తాము నిరసన తెలుపుతున్నామనే కారణంతో ఇతరులను అడ్డుకోవడం సరికాదని సీజేఐ పేర్కొన్నారు. మరోవైపు, రాజధానిలో వరుస నిరసనల కారణంగా వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటున్నాయని వ్యాపారుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి నిర్వహించిన భారీ ర్యాలీ కారణంగా నవంబర్ 1న ఢిల్లీ వాణిజ్య రంగానికి సుమారు రూ.11 వేల కోట్ల నష్టం వాటిల్లిందని చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) పేర్కొంది.

దియా మీర్జా వీడియోను తిరిగి అప్‌లోడ్ చేయండి



న్యూఢిల్లీ
దీపావళికి ముందు బహిరంగంగా రోడ్లమీద బాణసంచా కాల్చవద్దని సినీ నటి దియా మీర్జా పౌరులను కోరిన ఒక వీడియోపై కొంతమంది బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను బాంబే హైకోర్టు విమర్శించింది. కొందరు రాజకీయ నాయకులు చేసిన అసంబద్ధ వ్యాఖ్యలపట్ల తాము కలత చెందామని పేర్కొంది. భారత్ ఒక లౌకిక దేశం అని ఆ రాజకీయ నాయకులకు గుర్తుచేసింది.

మహారాష్ట్రతో నిరంతరం సంప్రదించండి

(మొదటి తరువాయి)

బ్యారేజ్ నిర్మాణం కారణంగా మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో జమ చేసేందుకు కూడా సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. పరిహారం చెల్లింపు విషయంలో ఆర్థికపరమైన అంశాలు అడ్డంకిగా మారకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వ వైఖరిని మహారాష్ట్రకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ముంపునకు గురయ్యే భూముల విస్తీర్ణం, స్వభావం, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం చెల్లించాల్సిన వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని భూముల ముంపుపై సర్వే నిర్వహించుకుంటే తెలంగాణకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. సర్వేకు అవసరమైన సహకారం అందించాలని, అక్కడి అధికారులు కోరిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. రెండు రాష్ట్రాల అధికారుల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్‌కు సంబంధించి గతంలో చేసుకున్న ఒప్పందాలు, ఇరు రాష్ట్రాల మధ్య జరిగిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలు, సాంకేతిక అంశాలకు సంబంధించిన పత్రాలను క్రమబద్ధీకరించాలని సీఎం ఆదేశించారు. వాటిని మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేసి, తదుపరి చర్చలకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. చర్చల సమయంలో కొత్త అంశాలు తెరపైకి రాకుండా అన్ని వివరాలతో ముందుగానే సిద్ధంగా ఉండాలని సూచించారు. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఆ శాఖ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ (జనరల్) రమేశ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

(మొదటి తరువాయి)

ఉందని తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడటంతో పాటు గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇప్పటికే తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఖమ్మం జిల్లా మధిరలో అత్యధికంగా 25.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, జనగామ,



రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి తదితర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచవచ్చని తెలిపింది. మరోవైపు మురసు తుపాను ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర బీభత్సం సృష్టించింది. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం వద్ద తుపాను తీరం దాటింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచగా, గరిష్ఠంగా 120 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు నమోదయ్యాయి. తుపాను ధాటికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. రహదారులపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెన్నై, తిరుపతి మార్గాల్లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు లక్షల హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 22 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నట్లు సమాచారం.

మోదీజీ.. బహిరంగ చర్చకు సిద్ధమా?

న్యూఢిల్లీ
ప్రధాని నరేంద్ర మోదీ తనపై, ప్రతిపక్షాలపై చేస్తున్న ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రతిపక్షాలకు విదేశీ శక్తులతో సంబంధాలు ఉన్నాయని, దేశాన్ని అస్థిరపరిచేందుకు విదేశీ సాయం తీసుకుంటున్నాయని ఆరోపిస్తున్న ప్రధాని.. ఈ అంశంపై తనతో చర్చించాలని డిమాండ్ చేశారు. తనకు విదేశాలతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణల్లో నిజం ఉంటే మోదీ తనపై పరువునష్టం కేసు ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. అంతేకాకుండా విదేశీ సాయంతోనే మోదీ ప్రధాని పదవిని చేపట్టారని రాహుల్ ఎదురుదాడి చేశారు. ఈ మేరకు మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో రాహుల్ గాంధీ పోస్టు చేశారు. ప్రధాని తనకు సవాల్ విసిరి 24 గంటలు గడిచినా చర్చకు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఏ వేదికనైనా, ఏ ప్రదేశాన్నైనా ఎంచుకోవచ్చని, దేశద్రోహి ఎవరు? విదేశీ శక్తులతో సంబంధాలు ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల



స్వరూపం ఏమిటి? అనే అంశాలపై చర్చిద్దామని అన్నారు. ప్రధాని భయపడకుండా చర్చకు రావాలని వ్యాఖ్యానించారు. చర్చలో ఇద్దరు నేతలతో పాటు మీడియా, దేశ యువత కూడా పాల్గొనేలా ఏర్పాటు చేయాలని సూచించారు. న్యాయనిర్ణేతగా ఎవరిని నియమించుకున్నా తనకు అభ్యంతరం లేదని, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను పెట్టుకున్నా అంగీకరిస్తానని పేర్కొన్నారు. బహిరంగ చర్చలో దేశ ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక నిర్మాణం, అమెరికాతో కుదిరిన ఒప్పందం వెనుక ఉన్న కారణాలు, కేబినెట్‌కు సమాచారం ఇవ్వకుండా ఒప్పందం ఎందుకు చేసుకున్నారనే అంశాలను ప్రస్తావిస్తానని రాహుల్ తెలిపారు. అదానీ కేసును ఎందుకు మూసివేశారని, ఎప్‌స్టీన్ వ్యవహారంలో అసలు ఏమి జరిగిందనే విషయాలపైనా ప్రశ్నలు సంధిస్తానని వెల్లడించారు. ఇంకా అనేక అంశాలపై ప్రజల సమక్షంలో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

రాహుల్‌కు రిజిజు కౌంటర్
రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ఇస్లామిక్ వాదులు లౌకికవాదం గురించి మాట్లాడటం, వేర్పాటువాదులు భారత జెండాలు పట్టుకోవడం, అరాచకవాదులు రాజ్యాంగ పుస్తకాన్ని ప్రదర్శించడం వంటిదే రాహుల్ తీరు అని విమర్శించారు. భారతదేశ శత్రువుల అజెండాలను ముందుకు తీసుకెళ్తూ ఇతరులు విదేశీ మద్దతు పొందుతున్నారని ఆరోపించడం ద్వారా కాంగ్రెస్ నేత తనను తానే ఎగతాళి చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. దీంతో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

సర్ వద్దంటే వీపులు సాఫే!

(మొదటి తరువాయి)



నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మహాపాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. శాంతినగర్ నుంచి వివేకానంద చౌక్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సహాయ ఇన్‌చార్జిలు అభయ్ పాటిల్, రేఖాశర్మ, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, గోడం నగేశ్, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సర్ ప్రక్రియకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. సర్ వద్దంటూ అడ్డుకుంటున్న నేతలు ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ దేశద్రోహానికి రక్షకురాలిగా వ్యవహరిస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్ర మోదీపై చేస్తున్న విమర్శలను ఆయన గరళకంఠుడిలా భరిస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సర్ ప్రక్రియ చేపట్టినప్పుడు ఎందుకు వ్యతిరేకించలేదని రాహుల్‌గాంధీని ప్రశ్నించారు. ఈ దేశ పౌరులే ప్రధానులు, ఎంపీలుగా ఎన్నికవుతారని, ఇటలీ సంతతికి చెందిన వ్యక్తులు ప్రధాని పదవి కోసం కలలు కనడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియకు మద్దతుగా అమిత్‌షా పిలుపునిస్తే దేశవ్యాప్తంగా లక్షలాది మంది స్పందించారని బండి సంజయ్ గుర్తుచేశారు. అనంతరం అమిత్‌షాకు తాము మర్యాదపూర్వకంగా వందనం చేస్తే, తనతో పాటు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. తమకు మద్యం పోసి, డబ్బులు పంచి జనాలను సమీకరించే సంస్కృతి లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలను ప్రజలు నిలదీసే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. తెలంగాణ గడ్డపై ఇక కాషాయ జెండానే ఎగురుతుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు నాయకత్వంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత, కరువు సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెన్షన్లు అందక వృద్ధులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, సంక్షేమ పథకాలు అందక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే రాష్ట్రంలో ఎస్ఆర్సీ తీసుకువస్తామని వ్యాఖ్యానించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగుతుంటే కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడం శోచనీయమన్నారు. అమిత్‌షా పిలుపు మేరకు సర్ ప్రక్రియకు మద్దతుగా బీజేపీ తరపున కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

తెలంగాణలో అధికారంపై బీజేపీవి పగటి కలలు

(మొదటి తరువాయి)

నిర్మాణంలో జరిగిన అవినీతిపై ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, ఆ పార్టీల నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు రాజకీయ నాటకాలు ఆడుతున్నారని పొంగులేటి విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

'ప్రళయ్' క్షిపణి పరీక్ష విజయవంతం



న్యూఢిల్లీ:
అత్యాధునిక 'ప్రళయ్' క్వాసీ బాలిస్టిక్ క్షిపణిని మంగళవారం ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి డీఆర్‌డీవో విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. సాధారణ బాలిస్టిక్ క్షిపణులతో పోలిస్తే తక్కువ ఎత్తులో ప్రయాణిస్తూ, గాలిలో దిశను మార్చుకునే సామర్థ్యం ప్రళయ్ సొంతం. దీంతో శత్రువుల వైమానిక రక్షణ వ్యవస్థలకు దీన్ని అడ్డుకోవడం కష్టమవుతుంది. ఈ క్షిపణిని భారత సైన్యం, వైమానిక దళంలో ప్రవేశపెట్టనున్నారు.

కాలపరీక్షకు తట్టుకున్న భారత్--రష్యా స్నేహం!

న్యూఢిల్లీ
ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిణామాలు మారుతున్నప్పటికీ భారత్--రష్యా మధ్య స్నేహ సంబంధాలు మాత్రం చెక్కుచెదరడం లేదని రష్యా స్పష్టం చేసింది. ఇరు దేశాల అనుబంధం కాలపరీక్షకు తట్టుకుని నిలబడిందని, బయటి శక్తులు ఈ బంధాన్ని మార్చలేవని పేర్కొంది. భారత్--రష్యా సంబంధాలు కేవలం ప్రభుత్వాలు, దౌత్య ఒప్పందాలకే పరిమితం కాలేదని, శతాబ్దాలుగా కొనసాగుతున్న ప్రజల మధ్య సాంస్కృతిక, చారిత్రక అనుబంధమే వాటికి అసలైన పునాది అని అభిప్రాయపడింది. ఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో నిర్వహించిన రష్యన్ సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న భారతదేశంలోని రష్యా రాయబార కార్యాలయ ప్రతినిధి పెత్రోవ్ సిజోవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్--రష్యా మధ్య చారిత్రక అనుబంధానికి నిదర్శనంగా మహాత్మా గాంధీ, ప్రముఖ రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్ మధ్య జరిగిన లేఖల మార్పిడిని ఆయన గుర్తుచేశారు. గాంధీజీ టాల్‌స్టాయ్‌ను తన గురువుగా భావించేవారని, వారిద్దరూ ప్రత్యక్షంగా కలుసుకోకపోయినా లేఖల ద్వారా ఆత్మీయ సంబంధాన్ని కొనసాగించారని వివరించారు. ఈ పరిచయం రెండు దేశాల ప్రజల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సంపాదకీయం

ఓటు తీర్పు.. ని పాలనకు గీటురాయి!



ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం అధికారాన్ని కట్టబెట్టే ప్రక్రియ మాత్రమే కాదు.. ప్రజల ఆకాంక్షలను, అసంతృప్తిని, ఆశలను ప్రతిబింబించే ప్రజా తీర్పు. ముఖ్యంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీల ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఎందుకంటే ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపైనే ఉంటుంది. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ, చెత్త నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలు సక్రమంగా కల్పించడమే స్థానిక పాలనకు అసలైన కొలమానం. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఇంటింటికీ తిరిగే నాయకులు.. గెలిచిన తర్వాత కూడా అదే బాధ్యతతో ప్రజల మధ్య ఉండగలిగితేనే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం చేకూరుతుంది. ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీలు, అభ్యర్థులు ముందుగా ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని గుర్తించాలి. గెలుపుతో బాధ్యత పెరుగుతుందే తప్ప అధికారం చెలాయించే అవకాశం లభించదనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ప్రత్యర్థులపై విమర్శలు, రాజకీయ కక్షలు, వ్యక్తిగత ఆధిపత్య ప్రదర్శనలకే పరిమితమైతే ప్రజలు ఆశించిన మార్పు సాధ్యం కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కార్యాచరణలోకి తీసుకురావాలి. వార్డుల వారీగా సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలి. నిధుల వినియోగంలో పారదర్శకత పాటించాలి. కాంట్రాక్టులు, అభివృద్ధి పనుల్లో అవినీతికి తావులేకుండా చూడాలి. స్థానిక సంస్థల పాలనలో ఎదురవుతున్న ప్రధాన సమస్య రాజకీయ జోక్యం. ప్రజల అవసరాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తే అభివృద్ధి కుంటుపడుతుంది. అధికార పార్టీకి చెందిన వార్డులకే నిధులు కేటాయించడం, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించే ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం వంటి ధోరణులు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. పట్టణం మొత్తం సమానంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పాలకవర్గాలు పనిచేయాలి. రాజకీయ భేదాలు ఎన్నికల వరకే పరిమితం కావాలి. ప్రజా సమస్యల పరిష్కారంలో అందరినీ కలుపుకొని ముందుకు సాగాలి. మరోవైపు పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాలు అందుకు అనుగుణంగా అభివృద్ధి చెందడం లేదు. జనాభా పెరుగుదలకు తగ్గట్టుగా తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, రహదారులు, పార్కులు, ప్రజారవాణా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. వర్షం కురిస్తే రోడ్లు చెరువులను తలపించడం, కాలనీల్లో మురుగునీరు నిలిచిపోవడం, చెత్త పేరుకుపోవడం వంటి సమస్యలు అనేక పట్టణాల్లో ప్రజలను వేధిస్తున్నాయి. వీటికి తాత్కాలిక పరిష్కారాలు కాకుండా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. పట్టణ ప్రణాళికలో భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ప్రజాప్రతినిధులు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను వినడం, అధికారులతో సమన్వయం చేసుకోవడం తప్పనిసరి. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తమ వార్డుల్లో నిరంతరం పర్యటించాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించాలి. సమస్య పరిష్కారానికి ఎంత సమయం పడుతుందో స్పష్టంగా చెప్పాలి. అభివృద్ధి పనుల పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండే పాలన ఏర్పడినప్పుడే స్థానిక సంస్థలపై విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వాల పాత్ర కూడా కీలకమే. స్థానిక సంస్థలకు తగినన్ని నిధులు, అధికారాలు, సిబ్బందిని అందించకుండా అభివృద్ధి ఆశించడం సాధ్యం కాదు. ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఏర్పాటు చేయడంతోనే బాధ్యత ముగిసిపోదు. వాటికి ఆర్థిక స్వావలంబన కల్పించాలి. ఆదాయ వనరులను పెంచుకునే అవకాశాలు కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు సమయానికి విడుదల చేయాలి. నిధుల కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా పర్యవేక్షించాలి. స్థానిక సంస్థలు స్వతంత్రంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలి. ప్రజల బాధ్యత కూడా ఇక్కడితో ముగియదు. ఓటు వేసిన తర్వాత ఐదేళ్లపాటు ప్రజాప్రతినిధులను ప్రశ్నించకుండా ఉండకూడదు. తమ ప్రాంతంలో జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించాలి. నిధుల వినియోగంపై సమాచారం అడగాలి. అక్రమాలు జరిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. కులం, మతం, డబ్బు, వ్యక్తిగత పరిచయాల ఆధారంగా కాకుండా అభ్యర్థి పనితీరు, నిబద్ధత, ప్రజాసేవా దృక్పథాన్ని బట్టి తీర్పు ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ప్రలోభాలకు లొంగకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి. ఎన్నికల ఫలితాలు ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినా ప్రజల సమస్యలు మాత్రం అందరికీ సమానమే. గెలిచినవారు బాధ్యతగా పనిచేయాలి. ఓడినవారు ప్రజల మధ్య ఉంటూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలి. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, పాలకుల తప్పులను ఎత్తిచూపడం కూడా ప్రజాస్వామ్యంలో కీలకమైన బాధ్యత. ఎన్నికల ఫలితాలను వ్యక్తిగత విజయంగా కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతగా భావించాలి. చివరకు ప్రజలు గుర్తుంచుకునేది ప్రచారంలో చేసిన ప్రసంగాలను కాదు.. తమ జీవితాల్లో వచ్చిన మార్పును, పరిష్కారమైన సమస్యలను, అందిన మౌలిక సదుపాయాలను మాత్రమే. అందుకే ఓటు ద్వారా వచ్చిన అధికారానికి ప్రజాసేవే లక్ష్యం కావాలి. ప్రజల తీర్పు పాలకులకు పదవి మాత్రమే కాదు.. ప్రతి రోజూ తమ పనితీరును నిరూపించుకోవాల్సిన బాధ్యత కూడా.

తొమ్మిదేళ్లు దోసుకొన్న దొంగలు మీరు ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరా..

-గత పాలకుల నిర్లక్ష్యంతోనే పాలమూరు రైతాంగానికి సాగునీటి అన్యాయం

-విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి నవంబర్ 3 మహాప్రభ

పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టి, అందిన కాడికి కమిషన్లు దండుకొని రైతాంగానికి తీరని అన్యాయం చేసిన గత పాలకులు.. ఇప్పుడు అదే ప్రాజెక్టుల పేరుతో రాజకీయ విమర్శలకు దిగడం దొంగే దొంగ దొంగ అన్నంత విడ్డూరంగా ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తొమ్మిదేళ్ల అధికారంలో ఉండి అందిన కాడికి దోచుకుని తిన్న నాయకులు నేడు నీతులు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు మంగళవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి గత ప్రభుత్వ పాలనను ఎండగట్టారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, జూరాల తదితర ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యాన్ని వివరించారు. ప్రాజెక్టుల పనులు పూర్తికాకపోవడానికి గత పాలకుల వైఫల్యమే కారణమని విమర్శించారు. జూరాల నీటి నిల్వ సామర్థ్యం, రామన్‌పాడు సమాంతర కాలువ నిర్మాణంలోని సాంకేతిక లోపాలు, గూడెం దొడ్డి రిజర్వాయర్ నిర్మాణం వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. అధికారంలో ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా అన్నారు పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందన్న హరీష్‌రావు వ్యాఖ్యలను ప్రశ్నిస్తూ.. ప్రాజెక్టు అంచనా వ్యయం, ఇప్పటివరకు జరిగిన ఖర్చు, మిగిలిన పనులపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతోందని తెలిపారు. కృష్ణా జలాల వినియోగం, ఆంధ్రప్రదేశ్‌కు నీటి తరలింపు అంశాలపై గత ప్రభుత్వ వైఖరిని మంత్రి జూపల్లి ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలోనే పాలమూరు రైతాంగానికి సాగునీటి విషయంలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న రైతులకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

బీఆర్ఎస్ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో 365 కరువు మండలాలను ప్రకటించిన కొద్ది రోజులకే రైతుల సమస్యలపై రాజకీయ విమర్శలకు దిగడం వారి వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారు? ఎన్ని పూర్తి చేశారు? పాలమూరు రైతాంగానికి ఎంత మేర సాగునీరు అందించారు? అన్న ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక లెక్కలు, వాస్తవ పరిస్థితుల ఆధారంగా ప్రజలకు వివరాలు వెల్లడిస్తోందని స్పష్టం చేశారు. కరువు పరిస్థితులపై ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమీక్షలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు సత్వర ఉపశమనం కల్పించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించిందని, వారిని ఆదుకునేందుకు అన్ని విధాలా కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు.

నీళ్ల దొంగ నిరంజన్

వనపర్తి లో ఉన్నావో మాజీ మంత్రి నీళ్ల నిరంజన్ కాదని.. నీళ్ల దొంగ నిరంజన్‌రెడ్డి' అంటూ ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

నిరంజన్‌రెడ్డికి సంబంధించిన ఫామ్‌హౌస్‌లలో అక్రమంగా బోర్లు తవ్వించి, రైతులకు అందాల్సిన సాగునీటిని తన ఫామ్‌హౌస్‌ల వైపు మళ్లించుకున్నారన్నారు

గతంలో 'వరి వేస్తే ఉరే' అంటూ రైతులను భయపెట్టిన నాయకులు, నేడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. ఉద్యోగాల కోసం పోరాడిన నిరుద్యోగులకు అమాలి పని చేసుకోవాలని సూచించిన నాయకులు ఇప్పుడు నిరుద్యోగుల పక్షాన మాట్లాడటం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బీఫామ్ కూడా దక్కదని ఎశ్రీఖ పేర్కొన్నారు గత పాలకులు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు రైతుల కష్టాలను రాజకీయ అస్త్రాలుగా మార్చుకోవద్దన్నారు రైతాంగానికి జరిగిన అన్యాయంపై చర్చకు సిద్ధమని, గత తొమ్మిదేళ్ల పాలనలో సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిపై బహిరంగంగా చర్చించాలని సవాల్ విసిరారు. అల్వాల వేదికగా హరీష్‌రావు చేసిన విమర్శలకు మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమాధానమిస్తూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ డిసిసి అధ్యక్షులు శంకర్ ప్రసాద్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు..





- ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారానికి పెద్దపీట

-కౌకుంట్లలో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

-29 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం.. విద్య, ఆరోగ్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 3 మహాప్రభ

దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకానికి దేవరకద్ర నియోజకవర్గంలో శ్రీకారం చుట్టారు. కౌకుంట్ల మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సుమారు 29 లక్షల మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఉదయం అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఆకలి, నీరసం కారణంగా చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. పోషకాహార లోపాన్ని నివారించడం, విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడటం, పాఠశాల హాజరును పెంచడం, డ్రాప్‌అవుట్లను తగ్గించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. వారంలో ఆరు రోజులపాటు వివిధ రకాల అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ అందించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏటా రూ.720 కోట్లు ఖర్చు చేస్తోందని, ఇందులో అల్పాహారానికి రూ.540 కోట్లు, పాల సరఫరాకు రూ.180 కోట్లు కేటాయించిందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి, వారితో సరదాగా ముచ్చటించారు. విద్యార్థులు ప్రతిరోజూ సమయపాలన పాటిస్తూ పాఠశాలలకు హాజరుకావాలని, ప్రభుత్వం అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యలో రాణించాలని సూచించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పిఎసిసిఎస్ వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట నవంబర్ 3 మహాప్రభ

యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేట మండలం, బోగారం లో పి ఏ సి సిఎస్, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు,ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నవారు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి ,సింగల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న జగన్మోహన్ ,సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల రాజిరెడ్డి గుత్తా నర్సిరెడ్డి, శంబాల వెంకన్న, బోగారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ



అధ్యక్షులు గోగు హరిప్రసాద్ యాదవ్ , బోగారం మాజీ సర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపిటిసి గోగు పద్మ సత్తయ్య యాదవ్ , వార్డు సభ్యులు కనుకు మల్లేష్ ,గోగు సురేష్ యాదవ్ ,చిరగొని శిల్ప నవీన్ యాదవ్, మండల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కందగట్ల రాహుల్ ,యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిరగోని నవీన్ యాదవ్, గుంతకండ్ల గోవర్ధన్ రెడ్డి , మేడి నరసింహ ,మాజీ రైతు సంఘం అధ్యక్షులు చెల్లమల్ల నర్సిరెడ్డి, మారం గోపాల్ రెడ్డి ,జెల్ల దత్తాత్రేయ, రైతులు కట్ట సత్తిరెడ్డి, మెట్టు అంజయ్య ,కట్ట పద్మా రెడ్డి, బై కానీ గోపాల్ ,కట్ట దశరథ రెడ్డి, గుంత కండ్ల నవీన్ రెడ్డి ,కొండం శ్రీనివాస్ రెడ్డి , బద్దుల కుమార్, గుంజే చంద్రం ,గోగు మహేష్, చిరబోయిన సాయి ,బొడ్డుపెల్లి నాని ,ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మంజీర విద్యార్థి జి. అభిరామ్ ఎంపిక



రామాయంపేట నవంబర్ 3 మహాప్రభ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో (అండర్-14) స్థానిక మంజీర విద్యాలయం విద్యార్థి జి. అభిరామ్ సత్తా చాటాడు. రన్నింగ్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విజేత అభిరామ్‌ను పాఠశాల కరస్పాండెంట్ జితేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వాసవి సురేష్, హెడ్మాస్టర్ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, శ్రీశైలం, ప్రవంతి మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలోనూ అభిరామ్ తన ప్రతిభను చాటి విజయం సాధించాలని యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.అభిరామ్ కృషికి తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై ఎస్ ఐ మహేందర్ అవగాహన..

ప్రజలకు, మహిళలకు కీలక సూచనలు..

గాంధారి నవంబర్ 3 (మహాప్రభ)



గాంధారి మండల కేంద్రంలోని గ్రామీణ బ్యాంకులో, ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు ఎస్సై మహేందర్ మండల ప్రజలకు, మహిళలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

సైబర్ నేరగాళ్ల పట్ల తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు:

– అపరిచిత లింకులు: ఎవరైనా పంపే అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దు. ఉచిత బహుమతులు, లాటరీ వచ్చిందని వచ్చే సందేశాలను నమ్మవద్దు.

– బ్యాంకు వివరాలు: బ్యాంకు అధికారులమని ఫోన్ చేసి ఓటీపీ, ఖాతా నంబరు, పాస్ వర్డ్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దు. బ్యాంకు ఎప్పుడూ ఓటీపీ అడగదు.

– ఫోన్ కాల్స్: మీ కుమారుడు ప్రమాదంలో ఉన్నాడని, పోలీసు కేసులో ఉన్నాడని బెదిరిస్తూ డబ్బులు అడిగితే భయపడి పంపవద్దు. వెంటనే 1930కు ఫోన్ చేయండి.

– సామాజిక మాధ్యమాలు: ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ లలో అపరిచిత వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించవద్దు. మీ వ్యక్తిగత ఫోటోలు, వివరాలు ఎవరికీ పంపవద్దు. మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలి.

– ఆర్థిక లావాదేవీలు: ఆన్ లైన్ లో వస్తువులు అమ్ముతామని, కొంటామని తక్కువ ధరకు ఆశ చూపి మోసం చేస్తారు. ముందుగా డబ్బులు పంపవద్దు.ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీసు స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలని ఎస్సై మహేందర్ తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా పోలీసు శాఖ అండగా ఉంటుందని, ఎలాంటి సహాయం కావాలన్నా సంప్రదించాలని కోరారు.

ఉత్తమ పాఠశాలగా ఎంపీయూపీఎస్ గంగాయిపల్లి ఎంపిక

ఉపాధ్యాయుల ఐకమత్యం, క్రమ-శిక్షణ, కష్టపడే తత్వమే విజయానికి కారణం: ఎంఈఓ బుచ్చా నాయక్

శివ్వంపేట నవంబర్ 3 (మహాప్రభ):



మెదక్ జిల్లా శివంపేట మండలంలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఉత్తమ పాఠశాలల ఎంపికలో భాగంగా ప్యానెల్ బృందం పాఠశాలలను సందర్శించి సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా శివంపేట మండలం గంగాయిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల (ఎంపీయూపీఎస్) గంగాయిపల్లిని ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు మల్లేశం సార్‌లను శివంపేట మండల విద్యాధికారి బుచ్చా నాయక్‌తో పాటు ప్యానెల్ బృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఎంఈఓ బుచ్చా నాయక్, ప్యానెల్ బృందం మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయుల మధ్య ఉన్న ఐకమత్యం, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతరం కష్టపడే తత్వం వల్లే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. గంగాయిపల్లి పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయడం పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామానికి కూడా గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

అడిషనల్ అడ్వకేట్ జనరల్‌తో సాదుల పవన్ కుమార్

నంగునూర్, నవంబర్ 3 (మహాప్రభ):



తెలంగాణ హై కోర్ట్ అడిషనల్ అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డిని ఏఎంసీ వైస్ చెర్మెన్ సాదుల పవన్ కుమార్ హైదరాబాద్ హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయ రంగానికి సంబంధించిన అంశాలతో పాటు ప్రజా సమస్యలపై ఇరువురు చర్చించారు. ప్రస్తుత న్యాయ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యే అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను న్యాయపరంగా పరిష్కరించే మార్గాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రజినీకాంత్ రెడ్డితో సమావేశం కావడం సంతోషంగా ఉందని సాదుల పవన్ కుమార్ పేర్కొన్నారు. న్యాయ రంగానికి సంబంధించిన పలు అంశాలపై విలువైన అభిప్రాయాలను పంచుకునే అవకాశం లభించిందన్నారు.

నియోజకవర్గంలో పెండింగ్ రోడ్లపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి

-నాలుగైదేళ్లుగా ప్రారంభంకాని కాంట్రాక్టుల రద్దు, రీ-టెండరింగ్‌కు డిమాండ్..

-పంచాయతీరాజ్ ఈఎన్‌సీకి మదన్‌మోహన్ విజ్ఞప్తి



ఎల్లారెడ్డి, నవంబర్ 3, (మహాప్రభ):

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బీటీ రోడ్ల నిర్మాణ పనులపై ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) జగదీశ్వర్‌ను కలిసి, సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులతో చేపట్టాల్సిన రోడ్ల పనుల పురోగతిపై చర్చించారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరై, కాంట్రాక్టర్లు అగ్రిమెంట్లు చేసుకుని నాలుగైదేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్లు లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లారు.

పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్లు:

– నాగిరెడ్డిపేట మండలం: గొల్లిలింగాల, రాఘవపల్లి, ఎర్రారం, ఆత్మకూరు, బొల్లారం మీదుగా జప్తి జానకంపల్లి రోడ్డు; తాండూర్--మసానిపల్లి రోడ్డు; వాడి మీదుగా చినూర్ రోడ్డు.

– సదాశివనగర్ మండలం: ఉత్నూర్--తుక్కోజివాడి మీదుగా భూమ్‌పల్లి రోడ్డు; జాతీయ రహదారి 44 నుంచి ధర్మారావుపేట మీదుగా అమర్లబండ రోడ్డు.

– ఎల్లారెడ్డి మండలం: వెల్లుట్ల మీదుగా తిమ్మారెడ్డి రోడ్డు.

– గాంధారి మండలం: గాంధారి నుంచి చాద్మల్ తండా, పిస్కుల్ గుట్ట తండా, పెద్ద గుజ్జుల్ తండా, చిన్న గుజ్జుల్ తండా, లోంక తండా, దాపు తండా మీదుగా బీర్మల్ తండా వరకు రోడ్డు.

వీటితోపాటు నియోజకవర్గంలోని ఇతర పెండింగ్ రోడ్డు పనులను కూడా త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు. ఏళ్ల తరబడి పనులు ప్రారంభించని కాంట్రాక్టర్ల అగ్రిమెంట్లను రద్దు చేసి, రీ-టెండరింగ్ నిర్వహించడం ద్వారా నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీకి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతిపై ఈఎన్‌సీ జగదీశ్వర్ సానుకూలంగా స్పందిస్తూ పెండింగ్ రోడ్డు పనుల అంశాన్ని పరిశీలించి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యాసంగిలో పంటల వైవిధ్యీకరణపై అవగాహన



దేవరకొండ డివిజన్ నవంబర్ 3 (మహాప్రభ)

కొండమల్లేపల్లిమండలంలోని పాత్లావత్ తండాలో వ్యవసాయశాఖఆధ్వర్యంలో కేతి బచావో అభియాన్ కార్యక్రమంలోభాగంగారైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వ్యవసాయఅధికారి (ఎం ఏ ఓ) అధ్యక్షత వహించగా, దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి ముఖ్యఅతిథిగాపాల్గొన్నారువ్యవసాయ విస్తరణ అధికారి (ఏ ఈ ఓ)తోపాటు పాత్లావత్ తండాకు చెందిన రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిఏడీఏశ్రీలక్ష్మిమాట్లాడుతూ యాసంగి సీజన్‌లో రైతులుపంటలవైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగాప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు.

యాసంగిలో వరి సాగుకు బదులుగా శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటి ప్రత్యామ్నాయపంటలసాగుపైరైతులుదృష్టిసారించాలని సూచించారు. పంటల మార్పిడిద్వారాభూసారాన్ని కాపాడుకోవడంతో పాటు సాగుఖర్చులనుతగ్గించుకుని మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు.రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయ శాఖ అందించే సలహాలు, సూచనలు, ప్రభుత్వపథకాలనుసద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో యాసంగి పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యత, రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలపై చర్చించారు. పాత్లావత్ తండా రైతులు ఈకార్యక్రమంలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

కల్వచర్ల గ్రామంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి చొరవతో విద్యుత్ స్తంభాలు,వీధి దీపాల ఏర్పాటు



రామగిరి నవంబర్ 3 (మహాప్రభ):

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని గొల్లపల్లె, కౌండిన్యనగర్ ప్రాంతంలో నూతన మీటర్ కనెక్షన్ పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పనులు చేపట్టారు.నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి,విద్యుత్ లైన్లు వేయడంతో పాటు వీధి దీపాలను సైతం ఏర్పాటు చేశారు.కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ప్రత్యేక చొరవతో కొత్త మీటర్ కనెక్షన్ మంజూరు చేయించి, సంబంధిత విద్యుత్ పనులు పూర్తి చేయించి స్థానికులకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చారు.దీంతో గొల్లపల్లె,కౌండిన్యనగర్ ప్రాంతంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, వీధి దీపాల ఏర్పాటుతో రాత్రివేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందించనున్నారు.గ్రామంలోని ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి తెలిపారు.విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపిన సర్పంచ్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో లైన్ మెన్ ఆకుల శ్రీనివాస్,వార్డు సభ్యులు,కరెంట్ సిబ్బంది,గ్రామపంచాయతీ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



దేవరకొండ డివిజన్. నవంబర్ 3 (మహా ప్రభ)

నేరడు గొమ్ము మండల కేంద్రంలోఉన్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు బుధవారం.నల్గొండమేకల అభినవ్ స్టేడియంలో జరిగిన కబడి ఆటలు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం ఎంతో గర్వకారణం.అండర్ – రాష్ట్రస్థాయి గాను ఎంపికైన బాలురు: ఎన్ అఖిల్ ,బాలిక లు.కే చందన ఎంపికయ్యారు. ప్రతిభ,పట్టుదల,కఠోర సాధనతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం సాధించిన విద్యార్థినీ,విద్యార్థులకు పాఠశాల కోటేష్ నాయక్ ప్రిన్సిపాల్,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,పీడీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ కబడ్డీ పోటీల్లో విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి,జట్టుకు విజయాన్ని అందించాలని ఆకాంక్షించారు.క్రీడలద్వారా క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించిఆదర్శపాఠశాలకు,నల్గొండ జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఎంపికైన విద్యార్థుల కుహృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొటేషన్ నాయక్ ,పీడీ శ్రీను నాయక్,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం



దేవరకొండ డివిజన్ నవంబర్ 3 (మహాప్రభ)

దేవరకొండమండలం,కర్నాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మంగ్యాతండాకు చెందిన నేనావత్ లాలు నాయక్ (తండ్రి.నేనావత్ వెన్యా నాయక్) ఇటీవల అకాల మరణం చెందడం పట్ల బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్. తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం.మంగ్యా తండాలోనిమృతునినివాసానికి చేరుకుని,వెన్య నాయక్ పార్థివ దేహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంచెప్పారు. పార్టీమరియు వ్యక్తిగత పరంగా ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అలాగే, తక్షణ సహాయంగా సదరు బాధిత కుటుంబానికి రూ.20,000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని కిషన్ నాయక్ గారు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీనాయకులు,కార్యకర్తలు మరియు తండావాసులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట మోడల్ స్కూల్‌లో కలెక్టర్ స్పోర్ట్స్ పోటీలు

బచ్చన్నపేట నవంబర్ 3 (మహాప్రభ)

బచ్చన్నపేట మోడల్ స్కూల్‌లో కలెక్టర్ స్పోర్ట్స్ పోటీలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పోటీల నిర్వహణకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం, పీఈటీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని, ఇలాంటి పోటీలు వారిలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.బచ్చన్నపేట ప్రాంతంలో విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తూ గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు బచ్చన్నపేట సర్పంచ్ అల్వాల నర్సింగరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందనలు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పించడమే నా లక్ష్యం

-సర్పంచ్ లపంగి నర్సింహా.



దేవరకొండ డివిజన్ నవంబర్ 3 (మహా ప్రభ)
మర్రిగూడెం మండల పరిధిలోని.రాంరెడ్డిపల్లి లో మంగళవారం మెగా జాబ్ మేళాకు విశేష స్పందన 150 మందికి పైగా యువతహాజరురాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీకార్యాలయంలో నిర్వహించిన మెగా జాబ్.మేళాకుయువతనుంచి.విశేషస్పందనలభించింది.ఈకార్యక్రమానికి సుమారు 100 నుంచి 150 మంది నిరుద్యోగయువతీయువకులు హాజరుకాగా, వారిలో 30 మంది ఉద్యోగాల కోసం దరఖాస్తులుచేసుకున్నారు.గ్రామీణ ప్రాంత యువత ఉద్యోగాల కోసం దూం ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా, వారి సొంత గ్రామంలోనే ఉద్యోగ అవకాశాలు.అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లపంగినర్సింహా మాట్లాడుతూ యువతలో ప్రతిభఉంది.కష్టపడే తపనఉంది.కావాల్సిందల్లా సరైన అవకాశం మాత్రమే.నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలుచూపించడం,వారి కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపడం నాబాధ్యతగా భావిస్తున్నాను. పదవి అనేది ప్రజలకు సేవచేయడానికి వచ్చిన అవకాశం. గ్రామ అభివృద్ధితో పాటు యువత భవిష్యత్తుకు బాటలువేయడమేనాలక్ష్యంఒక్కయువకుడికి ఉద్యోగం వచ్చినా ఒక కుటుంబంలో వెలుగు నిండినట్లే. ఇలాంటి ఉపాధి కార్యక్రమాలకు ఎన్నో జరగాలని ఆయన కోరారు.

త్వరలో వనపర్తికి రానున్న

-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

-మంగళవారం మర్యాదపూర్వకంగా సీఎం నుకలిసి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి అక్టోబర్ 3 మహా ప్రభ
వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముందుకు సాగుతున్నారు ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా అవసరాలు, భవిష్యత్ ప్రణాళికలపై ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు త్వరలోనే ముఖ్యమంత్రి వనపర్తి రానున్న నేపథ్యంలో, అందుకు సంబంధించి అంశాలపై వారు మాట్లాడుకున్నట్లు తెలిపారు

మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన

-ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో ఘనంగా ప్రారంభం



గాంధారి నవంబర్ 3 (మహా ప్రభ)
గాంధారి మండలం చద్మల్ తండాలో మంగళవారం రోజున ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాలతో మహిళా భవన్ కు శంకుస్థాపన చేసినట్లు గ్రామ సర్పంచ్ దేవి సింగ్ నాయక్, ఉప సర్పంచ్ ప్రవీణ్ నాయక్, గ్రామ సంఘం అధ్యక్షురాలు సేవ్, కార్యదర్శి గంగాబాయి, కోశాధికారి సీత, వారి చేతుల మీదుగా భూమి పూజ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్సీ అమర్ సింగ్ నాయక్, మండు పెంటయ్య నాయక్, బస్సీ దేవి సింగ్ నాయక్, సర్పంచ్ ఆంగోత్ ప్రవీణ్ నాయక్, ఉప సర్పంచ్ బస్సీ వెంకట్ రామ్ నాయక్, మాజీ సర్పంచ్ బస్సీ రతిరాం నాయక్, మండు జగదీష్ నాయక్, బస్సీ గర్దాస్ నాయక్, మాలి ఇంద్రజిత్, బస్సీ చంద్రశేఖర్, మాలి రవీందర్, గుజ్రా నాందేవ్, మంజా గోవింద్, బస్సీ రమేష్, బర్దావల్ మధోష్, బస్సీ బలరామ్, మహిళా సంఘం అధ్యక్షురాలు మాలి సేవ్, సిసి గొర్రె రాములు, వివోలు శ్రావణి, పద్మ, గుజ్రా సీత బాయి, బామన్ గంగ బాయి మరియు తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు.

రవీందర్ గౌడ్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి.



మెదక్ జిల్లా 03 నవంబర్ (మహాప్రభ
హవేలి ఘన్‌పూర్ మండలం రాజుపేట గ్రామానికి చెందిన దర్గకాడి రవీందర్ గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. బోరు మోటారు కాలిపోవడంతో దానిని మరమ్మతు చేస్తుండగా వేడి ఆయిల్ మీద పడటంతో ఆయన చేయి కాలింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి రవీందర్ గౌడ్ ను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయనకు మనోధైర్యం కల్పించారు.

కరువు ప్రభావిత రైతులకు వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ

- అర్హులైన రైతుల గుర్తించి బ్యాంకులు పూర్తి సహకారం అందించాలి:

-జిల్లా ఇంచార్జి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

పుట్టపర్తి నవంబర్ 3 మహాప్రభ
రాష్ట్ర ప్రభుత్వం జి. ఒ నెంబర్ 03, అక్టోబర్ 24, 2026 ప్రకారం వనపర్తి జిల్లాలో ఎల్ నీనో ప్రభావం వల్ల 11మండలాలను కరువు పీడిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో కరువు ప్రభావిత రైతులను ఆదుకోడానికి మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరెట్ కాన్ఫరెన్స్ హాల్లో బ్యాంకర్ల ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు.
జిల్లాలోని (6) మండలాలు అమరచింత, పాన్గల్, కొత్తకోట, ఆత్మకూర్, వీపనగండ్ల, ఏదుల మండలాలను తీవ్రమైన కరువు మండలాలు గాను, (5) మండలాలు పెద్దమందడి, ఘనపూర్ గోపాల్పేట వనపర్తి పెబ్బేర్ మండలాలను మోస్తారు కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో, కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించడం, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, నూతన పంట రుణాల మంజూరు తదితర అంశాలపై బ్యాంకు అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరువు పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గి, సాగునీటి కొరతతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హులైన రైతులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్), రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మార్గదర్శకాల ప్రకారం రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా అన్ని బ్యాంకు శాఖల పరిధిలో మొత్తం 44816 మంది రైతులు రూ. 635.45 కోట్ల విలువైన పంట రుణాలు పొందగా, మరో 24902 మంది రైతులు రూ. 862.15 కోట్ల



విలువైన వ్యవసాయ కాలపరిమితి రుణాలు పొంది ఉన్నారని, వీరందరికీ నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.
అర్హత కలిగిన రైతుల వ్యవసాయ రుణాలకు 12 నెలల మారటోరియం కల్పించి, తిరిగి చెల్లింపు వ్యవధిని తీవ్రమైన కరువు మండలాల రైతులకు గరిష్టంగా 60 నెలలు, మోస్తారు కరువు ప్రభావిత మండలాల రైతులకు 36 నెలల వరకు పొడిగించే విధంగా మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను చేపట్టాలని, మారటోరియం అనంతరం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రుణాల చెల్లింపులు జరిగేలా చూడాలని తెలిపారు. రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు రైతులకు తదుపరి పంటల సాగు కోసం నూతన పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలని స్పష్టం చేశారు. రైతులపై ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, కరువు ప్రభావిత అర్హులైన రైతుల విషయంలో బలవంతపు రుణ వసూళ్లకు పాల్పడరాదని బ్యాంకు అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన రైతులను, రుణ ఖాతాలను గ్రామాలు, మండలాల వారీగా గుర్తించాలని, రైతు వేదికలు, గ్రామసభలు, ఆర్థిక అక్షరాస్యత శిబిరాల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో బ్యాంకు శాఖల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించి, అమలు పురోగతిపై నివేదికలు సమర్పించాలని సూచించారు.
అర్హులైన వారందరికీ ఈ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లాలోని రైతులకు కరువు పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని, నిర్దేశించిన గడువులోగా రుణ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఈ స్పెషల్ నోటిఫికేషన్ ద్వారా పొందే రుణాలు ఎట్టి పరిస్థితిలో రుణ మాఫీ జరుగదు. కాకపొతే ఒక సంవత్సరం వరకు ఋణం తిరిగి చెల్లించకుండా తర్వాత నుండి తిరిగి చెల్లించాల్సి ఉంటుందని రైతులకు ముందే అవగాహన కల్పించాలని బ్యాంకర్లను సూచించారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి వినోద్ కుమార్,లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఎల్ డి ఓ ప్రదీప్ చంద్ర నాయక్, నాబార్డ్ డిడిఎం మోహన్ రెడ్డి, వివిధ బ్యాంకుల జిల్లా మరియు స్థానిక శాఖల మేనేజర్లు, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దవంగర మండలంలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

-అక్రమ గుడుంబా తయారీపై ఉక్కుపాదం..

-20 లీటర్ల గుడుంబా స్వాధీనం, 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



పెద్దవంగర అక్టోబర్ 03 (మహాప్రభ)
మండలంలోని రాజమాన్సింగ్ తండా, జయరాం తండా, పడమటి తండాల్లో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. తొర్రూరు సీఐ గణేష్ ఆధ్వర్యంలో ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు ఈ తనిఖీలు కొనసాగాయి.
ఈ సందర్భంగా అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న నలుగురిని పోలీసులు గుర్తించి, వారి వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి నలుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
కేసులు నమోదైన వారి వివరాలు:
1. గుగులోతు మంగ్య -- దేవోజీ కుమారుడు, జయరాం తండా.
2. బానోతు సత్తమ్మ -- చక్రు భార్య, జయరాం తండా.
3. దారావత్ సోమలి -- దేవుసింగ్ భార్య, పడమటి తండా.
4. జాటోత్ రమేష్ -- అమరసింగ్ కుమారుడు, రాజమాన్సింగ్ తండా.
ఈ తనిఖీల్లో తొర్రూరు ఎస్ఐలు మహేందర్ రెడ్డి, ఖాదర్ పాషా, వెంకన్న, కట్టమల్లు, దంతాలపల్లి ఎస్ఐ రవి, నర్సింహులపేట ఎస్ఐ వెంకన్నతో పాటు సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే గుడుంబా తయారీని అరికట్టేందుకు నిరంతర తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

శివంపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మల్లారెడ్డి విశ్వవిద్యాలయ వ్యవసాయ విద్యార్థులు



శివంపేట, నవంబర్ 3 (మహాప్రభ):
మెదక్ జిల్లా శివంపేట గ్రామంలో మల్లారెడ్డి విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌కు చెందిన వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కార్య అనుభవ కార్యక్రమం లో భాగంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల నిర్వహణ, విద్యార్థుల సంఖ్య, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు కల్పిస్తున్న అభ్యసన వాతావరణాన్ని పరిశీలించారు. ఈ పర్యటన ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య ప్రాధాన్యత, విద్యా వ్యవస్థ పనితీరు, గ్రామీణ సమాజ అభివృద్ధిలో పాఠశాలల పాత్రపై వ్యవసాయ విద్యార్థులకు అవగాహన ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ధరణి, మాన్విక, ఉమామహేశ్వరి, నవ్య తేజస్వి, లహరి, సనా, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో దరఖాస్తులు అందజేత



పాపన్నపేట, నవంబర్ 3(మహా ప్రభ)
పాపన్నపేట మండలం లోని నార్సింగి విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో వినియోగదారుల సదస్సును అధికారులు మంగళవారం నిర్వహించారు. 5 మండలాల పరిధి లోని గ్రామాల రైతులు, ప్రజల నుండి 14 దరఖాస్తులు అధికారులకు అందాయి. ఈసదస్సులో సబ్ డివిజన్ పరిధి లోని విద్యుత్ శాఖ ఏఈలు నర్సింలు,ఉదయ్ కుమార్,శ్యామ్ సుందర్, నవాజ్,రామామూర్తి తదితరులు ఉన్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడికి పరామర్శ



వనపర్తి నవంబర్3 మహాప్రభ
నాగర్ కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ బి రాములు ని పరామర్శించిన తెలుగుదేశం పార్టీజాతీయ అధికార ప్రతినిధి జోష్ణ పరమర్శించారు భవిష్యత్తులో పార్టీ నుంచి ఎలాంటి అవసరం ఉన్న అని విధాల చూసుకుంటామని ధైర్యం చెప్పారు మీరు త్వరగా కోలుకొని పార్టీకి మీ సేవలు ఎంతో ముఖ్యమని మన ధైర్యంతో ఆయురారోగ్యాలతో ఉండాలని ధైర్యాన్ని ఇచ్చారు ఇట్టి కార్యక్రమంలో కొత్త గొల్లశంకర్ లచ్చ గౌడ్ కొప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పాపన్నపేట కబడ్డీ జట్లు



పాపన్నపేట, నవంబర్3(మహా ప్రభ)
మెదక్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల అండర్ 17 కబడ్డీ పోటీలలో పాపన్నపేట ఉన్నత పాఠశాల బాలుర బాలికల జట్లు గెలుపొంది. రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పిడి రమేష్ వెల్లడించారు. మెదక్ జిల్లా నుండి 24 పీఎం శ్రీ పాఠశాలలు ఈ పోటీలలో పాల్గొనగా పాపన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన బాలుర జట్టు, బాలికల జట్టు గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. హైదరాబాదులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో ఈ రెండు చెట్లు పాల్గొంటారని పిడి రమేష్ వెల్లడించారు. జిల్లాస్థాయి పోటీలలో పాపన్నపేట జట్లు రెండింటికీ రెండు ఎంపిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నాయకుడు బండారు వెంకన్న కుటుంబంలో విషాదం

రాములమ్మ మృతికి పలువురు నాయకుల నివాళులు



పెద్దవంగర అక్టోబర్ 03 (మహాప్రభ)

పెద్దవంగర మండలం వడ్డె కొత్తపల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బండారు వెంకన్న గౌడ్ తల్లి బండారు రాములమ్మ (నవంబర్ 2) ఆదివారం ఉదయం 11:20 గంటలకు కన్నుమూశారు. ఆమె మరణంతో కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం వడ్డేకొత్తపల్లిలోని ఆమె స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రాములమ్మ మృతివార్త తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రముఖులు, బంధువులు అంత్యక్రియలకు హాజరయ్యారు. ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బండారు వెంకన్న గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దంతాలపల్లి రవి, వార్డు సభ్యులు బొల్లు ఉషయ్య, కేశబోయిన చంద్రబోస్, నాయకులు చట్టు యాకన్న, రావుల శ్రీను, బంధు సత్యం, మాజీ ఉపసర్పంచ్ మొర్రిగాడ్డుల శ్రీనివాస్, గ్రామ పెద్దలు కేశబోయిన బోజాలు, మద్దెల గురవయ్య, బొల్లు వెంకన్న, ముత్తినేని వెంకన్న, సోమేశ్వర్, మద్దెల స్వామి, గంగాధరి సుధాకర్, మురళి తదితరులు పాల్గొన్నారు.

టెండర్ లో కోడ్ చేసిన గుత్తేదారులు అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన కందిపప్పు అందించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు.



మెదక్ జిల్లా 03నవంబర్ (మహాప్రభ)

మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా, శిశు, వికలాంగుల మరియు వయో వృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరిగింది
ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ 1076 అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన కందిపప్పు వన్ కేజీ ప్యాక్ సరఫరా చేయుటకు ఆసక్తిగల ప్రభుత్వ వాణిజ్య పనుల శాఖ నందు రిజిస్టర్ అయిన మిల్లర్స్ హోల్సేల్ గవర్నమెంట్ ఏజెన్సీస్ వ్యాపారస్తుల నుండి గతంలోనే టెండర్కు ఆహ్వానించడం జరిగిందని తెలిపారు తద్వారా ఈరోజు టెండర్ల కార్యక్రమం నిర్వహించి సమర్థత గల వ్యాపారస్తులకు నాణ్యమైన కందిపప్పు అందించేందుకు టెండర్లు దక్కించుకోవడం జరిగింది అన్నారు.
ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి హేమ భార్గవి, పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, మేనేజర్ జగదీష్, డీఈఓ రాజు, రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి సంబంధిత గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు టీడీపీ సంఘీభావం

-ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి.. వేతనాలు పెంచాలి



పెద్దపల్లి నవంబర్ 3 మహాప్రభ

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ తిరుణగరి జ్యోత్స్న డిమాండ్ చేశారు. పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆమె సంఘీభావం తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు సంజయ్ కుమార్, టీడీపీ పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు అక్కపాక తిరుపతితో కలిసి సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉద్యోగులకు కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉండగా ఉద్యోగి మరణిస్తే వారి కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ సంజయ్ కుమార్, కోటగిరి పాపయ్య, మహిళా నాయకురాళ్లు షరీఫా, అంజలితో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు..

బీసీ కులాల భవనాలపై ప్రభుత్వ కుట్ర తగదు

-జీ.వో. నం.14 ను వెంటనే రద్దు చేయాలి

-మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తమరావు ఆగ్రహం

శివ్వంపేట నవంబర్ 3 (మహాప్రభ)

:తెలంగాణ సమాజ నిర్మాణంలో, సంస్కృతిలో, ఉత్పత్తి రంగంలో వెన్నెముకగా నిలిచిన వెనుకబడిన తరగతుల (బీసీ) ఆత్మగౌరవంపై ప్రస్తుత ప్రభుత్వం కక్షా సాధింపు చర్యలకు దిగడం తగదని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 36 బీసీ కులాలపై ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేఖ చర్యలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుట్టం పురుషోత్తమరావు మాట్లాడుతూ శతాబ్దాల అణచివేతను ఎదిరించి, తమకంటూ ఒక సామాజిక భద్రతను, అస్తిత్వాన్ని చాటుకోవడానికి గత ప్రభుత్వం కేటాయించిన 'ఆత్మగౌరవ భవనాల' భూములను, వాటి స్వయంప్రతిపత్తిని కాలరాసేలా ఇప్పటి తెచ్చిన జి.ఓ. 14 ఉత్తర్వులు అత్యంత దుర్మార్గమైనవన్నారు. దీనిని మున్నూరు కాపు సంఘం తరఫున, 36 బీసీ కులాల ఆత్మగౌరవ కార్యాచరణ కమిటీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వంలోని అగ్రకులాల నాయకుల ఒత్తిళ్లతో, బీసీలను ఎప్పటికీ అణగదొక్కాలని, తమకిందే ఉంచుకోవాలనే కుట్రపూరిత ధోరణితోనే ప్రభుత్వం ఈ జీవోను తీసుకురావడం ఇంతవరకు సమంజసం అని పుట్టం ప్రశ్నించారు . గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల సంక్షేమం, స్వయం ప్రతిపత్తి కోసం బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి భూములిచ్చి, కొన్ని కులాల వారికి నిధులు కూడా ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. బీసీ కుల సంఘాలకే పూర్తి యాజమాన్య, నిర్వహణ స్వేచ్ఛను ఇచ్చిందని కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలను పూర్తిచేసి ఆయా కులాలకు



అప్పగించాల్సింది పోయి ఇష్ట రితిన వ్యవహరిస్తూ, రాష్ట్రంలో ఏక్ నిరంజన్ పాలన కొనసాగించడం సిగ్గుచేటు అన్నారు. బీసీ కులాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులను ఇవ్వకుండా ఎందుకు నిరాకరిస్తూ, కుల సంఘం తమ బిడ్డలు చదువుల కోసం, సమావేశాల కోసం నిర్మించుకునే భవనాలపై కూడా ప్రభుత్వాల పెత్తనం చేయడం అత్యంత దుర్మార్గకరమని ఆయన ఆక్రోషం వెలగక్కారు. జీవో 14లోని నిబంధనలు చూస్తుంటే ఇది ఆత్మగౌరవ భవనమా లేక బీసీలను బందీలుగా మార్చే చీకటి రాజ్యం రూపొందించిన జీవోనా? అనే సందేహం కలుగుతున్నది. కమిటీల ఏర్పాటులోనూ, నిర్వహణలోనూ ప్రభుత్వం, అధికారుల గుత్తాధిపత్యం చెలాయిస్తూ, అన్ని అధికారాలను తమ గుప్పిట్లో పెట్టుకొని, కులస్తులు అందరూ కలిసి ఎన్నుకున్న రాష్ట్ర కార్యవర్గాన్ని, కుల పెద్దలను మూగ ప్రేక్షకులుగా మార్చాలని ఈ ప్రభుత్వం కుట్రతో వ్యవహరిస్తుందని బీసీలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జీవోను చూస్తూ బహుజనులు ఊరుకోరన్నారు. భూములను అమ్ముకోవడం లేదనే సాకుతో, వాటిపై ఎలాంటి వాణిజ్య లేదా స్వయం అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోకుండా కట్టడి చేయడం ద్వారా ఆ భవనాలను నిరుపయోగంగా మార్చాలని ఈ ప్రభుత్వం ఆ విధంగా ప్రయత్నాలు చేయడం బడుగులపై పాశవికా అస్త్రాన్ని ప్రయోగించడం కాదా అని సర్దార్ పుట్టం పురుషోత్తమరావు ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ కుట్రలను బీసీ సమాజం గమనిస్తూ, అన్ని విషయాలను, గమనంలోకి తీసుకుంటుందని, బీసీ కులాలవారు తమ సొంత విరాళాలతో భవనాలు కట్టుకున్నా సరే, ప్రభుత్వానికి నెలవారీ నివేదికలు ఇవ్వాలనే బానిసత్వపు నిబంధనలు బీసీ కులాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. నేడు ప్రభుత్వ పాలకులు తమ దయా దాక్షిణ్యాల కోసం బీసీలు ఎదురుచూడాల్సిన దుస్థితి తీసుకువచ్చారని చెప్పారు. బీసీల న్యాయమైన డిమాండ్లు 1. బీసీల ఆత్మగౌరవాన్ని, హక్కులను హరించే జీ. ఓ. ఎం.ఎస్ నెం. 14 (తేది: 29-10-2026) ను ప్రభుత్వం వెంటనే బేషరతుగా రద్దు చేయాలి.
2. 2018 నాటి జీవోల ప్రకారం బీసీ కుల సంఘాలకే పూర్తి యాజమాన్య, నిర్వహణ స్వేచ్ఛను ఇవ్వాలి. 3. బీసీ కులాల వారీగా పెండింగ్లో ఉన్న నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు.
ఒకవేళ ప్రభుత్వం తన అహంకార పూరిత వైఖరిని మార్చుకోకపోతే, బీసీ కులాలన్నీ ఒక్కటై ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్నాయని సర్దార్ పుట్టం పురుషోత్తమరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఆత్మగౌరవం కోసం పుట్టిన ఈ భవనాలే పాలకుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా చైతన్య కేంద్రాలుగా మారుతాయని, తెలంగాణ పోరాటాలకు పేరుగాంచిన గడ్డ అని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది బీసీలతో కలిసి ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి తీరును, ఈ ప్రభుత్వాన్ని సర్దార్ తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి చెప్పేది ఒకటి, చేసేది మరొకటి అని, ముఖ్యమంత్రి అవలంబిస్తున్న ప్రాధాన్యతల క్రమం ఏమిటని సర్దార్ సూటిగా ప్రశ్నించారు. నీది తెనాలి, నాది తెనాలి అనే సీఎం వైఖరి సరైనది కాదని, దీంతో రాష్ట్రంలో అలజడులు పేట్రేగి, ఇది నిరంకుశత్వం వైపు దారితీస్తుందని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కరువు ప్రకృతి వైపరీత్యం..

-ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

-తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు

-- విద్యుత్, సాగునీటి అంశాలపై అధికారులకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాలు

దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 3 మహాప్రభ

దేవరకద్ర: కరువు అనేది ప్రకృతి వైపరీత్యమని, దానిని దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) సూచించారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.
మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నీటి సమస్యలు ఎదురైతే సర్పంచులు, ప్రజాప్రతినిధులు ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని, సమస్య తీవ్రతను బట్టి తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.
తాగునీటి సమస్యలపై సర్పంచుల విజ్ఞప్తి
సమావేశంలో నార్లోనికుంట, లక్ష్మీపల్లి గ్రామాల సర్పంచులు గౌని లక్ష్మమ్మ, పెద్దమోని లక్ష్మమ్మ తమ



గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతుల బోరుబావుల నుంచి గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ
డోకూర్ సర్పంచ్ శ్రీను గ్రామంలో నెలకొన్న విద్యుత్ సరఫరా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన జీఎంఆర్ సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుదల కోసం ఇప్పటికే సుమారు 2,000 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశామని, అవసరాన్ని బట్టి మరిన్ని ట్రాన్స్‌ఫార్మర్లు కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.
నీటి లభ్యతను బట్టే యాసంగి సాగు చేయాలి
భూగర్భ జలాల పరిస్థితిని అంచనా వేయకుండా యాసంగి పంటల సాగుకు రైతులు ముందుకు రావద్దని ఎమ్మెల్యే సూచించారు. బోరుబావుల్లో సమృద్ధిగా నీరు ఉన్నప్పుడే పంటల సాగు చేపట్టాలని, భూగర్భ జలాలు తగ్గిన పరిస్థితుల్లో సాగు చేస్తే పెట్టుబడులు పెట్టి చివరకు పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు ముందుచూపుతో వ్యవహరిస్తూ నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని సూచించారు.
వాతావరణ శాఖ జారీ చేసే సూచనలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గ్రామస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు పంటల సాగు, నీటి వినియోగం, భూగర్భ జలాల పరిస్థితులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.
ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. తాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు.
ఈ సమావేశంలో సీల్దార్ హర్షద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర అభివృద్ధికి మరో ముందడుగు..

- కీలక ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే జీఎంఆర్ కృషి

-సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఫైర్‌స్టేషన్, పోలీస్ సర్కిల్ కార్యాలయం మంజూరుకు చర్యలు

-- ఇప్పటికే డిగ్రీ కళాశాల, కోర్టుల ఏర్పాటు

దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 3 మహాప్రభ

దేవరకద్ర: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా దేవరకద్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు నియోజకవర్గంలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దేవరకద్ర మున్సిపాలిటీ లోని మంగళవారం బల్సుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవరకద్ర అభివృద్ధిలో భాగంగా నూతనంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, ఫైర్‌స్టేషన్, పోలీస్ సర్కిల్ కార్యాలయాలను మంజూరు





చేయించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే దేవరకద్రలో డిగ్రీ కళాశాల, కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల అవసరాలకు అనుగుణంగా



మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులకు ఉచిత యూనిఫాంలను, అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దమయంతి-గోవర్ధన్, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కౌన్సిలర్లు 10వ వార్డు అరుణ-చంద్రమౌళి, 2వ వార్డు భీమన్న, 5వ వార్డు దొబ్బలి అంజలి-రామాంజనేయులు, 6వ వార్డు గోపీ మాధవి, 7వ వార్డు బీరప్ప, 8వ వార్డు గోవిందు, ఎంపీడీవో శ్రీనివాసరావు తహసీల్దార్ మహమ్మద్ అర్షద్, మండల విద్యాశాఖాధికారి బలరాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్సుపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున 'కింగ్ 100' నుంచి అదిరిపోయే అప్‌డేట్..

-టబు పాత్ర గ్లింప్స్ వచ్చేది అప్పుడే!



అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక మైలురాయిగా తెరకెక్కుతున్న 100వ చిత్రం 'కింగ్ 100' (#అఅన్100) పై సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న ప్రముఖ నటి టబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను రేపు ఉదయం 9:00 గంటలకు విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.సుమారు 28 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నాగార్జున, టబు కలిసి నటిస్తుండటంతో ఈ గ్లింప్స్ మీద అందరిలోనూ విపరీతమైన ఆసక్తి నెలకొంది. రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది.

మరింత ఫన్‌తో..

తరుణ్ భాస్కర్ 'ఈఎన్ఈ రిపీట్' ట్రైలర్ విడుదల!



టాలీవుడ్‌లో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుని ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన 'ఈ నగరానికి ఏమైంది' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న మోస్ట్ అవేటెడ్ ఫిల్మ్ 'ఈఎన్ఈ రిపీట్' నుంచి తాజాగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. టాలెంటెడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగంలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించిన అదే ఫ్రెండ్స్ గ్యాంగ్, ఈసారి మరింత సరికొత్త ఫన్, అపరిమితమైన జోష్‌తో ఒక కొత్త మిషన్ కోసం వస్తున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది.మాస్ కా దాస్ విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, వెంకటేష్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాపై యూత్‌లో విపరీతమైన క్రేజ్ ఉంది. మొదటి సినిమాలో కనిపించిన స్నేహితుల మధ్య ఉండే బాండింగ్, డైలాగ్స్ మరియు సిట్యువేషనల్ కామెడీని మించి ఈ సీక్వెల్ ఉండబోతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ఈ చిత్రాన్ని నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తో



షారుఖ్ ఖాన్ 'కింగ్' సంచలనం..

విడుదల ముందే రూ. 800 కోట్ల భారీ బిజినెస్!



బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' తెరపైకి రాకముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం డిసెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అయితే, సినిమా థియేటర్లోకి రాకముందే ప్రీ-రిలీజ్ బిజినెస్ పరంగా భారీ వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల విడుదలైన 'తు మిలా జాయే' సాంగ్ టీజర్, రొమాంటిక్ విజువల్స్, యాక్షన్ సీక్వెన్సులు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి.పలు మీడియా నివేదికల ప్రకారం.. 'కింగ్' సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్, థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్, ఓవర్సీస్ రైట్స్, మ్యూజిక్ అలాగే శాటిలైట్ లేదా టెలివిజన్ హక్కుల ద్వారా దాదాపు రూ. 800 కోట్లకు పైగా ప్రీ-రిలీజ్ బిజినెస్ లావాదేవీలను పూర్తి చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ డీల్స్ కారణంగా బాలీవుడ్ చిత్రసీమలో ఈ ప్రాజెక్ట్ అత్యంత భారీ క్రేజ్ సంపాదించుకున్న చిత్రంగా నిలిచింది. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ పెట్టిన నిర్మాణ వ్యూహం కూడా హాట్ టాపిక్ అయింది. 'కింగ్' సినిమా అంచనా బడ్జెట్ దాదాపు రూ. 350 కోట్ల నుండి రూ. 450 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. అంటే సినిమా విడుదలకు ముందే తన నిర్మాణ ఖర్చును సులభంగా అధిగమించడమే కాకుండా, పెట్టిన పెట్టుబడికి దాదాపు రెట్టింపు లాభాలను ప్రీ-రిలీజ్ డీల్స్ ద్వారా వెనక్కి రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో షారుఖ్ ఖాన్ తో పాటు ఆయన కూతురు సుహానా ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, దీపికా పదుకొణె కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. వీరితో పాటు అభిషేక్ బచ్చన్, అనిల్ కపూర్, రాణి ముఖర్జీ, జైదీప్ అహ్లావత్, జాకీ ష్రాఫ్, రాఘవ్ జుయల్ మరియు అభయ్ వర్మ వంటి భారీ తారాగణం ఈ చిత్రంలో ఉన్నట్లు సమాచారం. సిద్ధార్థ్ ఆనంద్ టేకింగ్, భారీ స్టార్ కాస్ట్ మరియు రికార్డు స్థాయి ప్రీ-రిలీజ్ బిజినెస్ తో 'కింగ్' సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టిస్తుందోనని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇకపై ఆచితూచి మాట్లాడతా..

-వివాదాలపై సాయిపల్లవి ఆసక్తికర వ్యాఖ్యలు



స్వీయ లోపంబులెరుగుట పెద్ద విద్య అనేది ఆర్యోక్తి. ప్రతి ఒక్కరిలో లోపాలు సహజం. వాటిని తెలుసుకొని, సరిచేసుకునేవారే స్థితప్రజ్ఞులు. ప్రముఖ నటి సాయిపల్లవి ఈ విషయాన్ని కాస్తంత ఆలస్యంగా తెలుసుకున్నది. ఈ మధ్య పలు సందర్భాల్లో ఆమె మాట్లాడిన మాటలు వివాదాలకు దారితీశాయి. అందుకే ఇకపై ఆచితూచి మాట్లాడాలని ఆమె ఫిక్సయ్యారట.తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'మీలో పెంచుకోవాల్సిన స్కిల్ ఏమిటి?' అనే ప్రశ్నకు సమాధానంగా సాయిపల్లవి మాట్లాడుతూ 'మనసులోని భావాలను వ్యక్తీకరించడం నాకు చేతకాదు. దాంతో.. ఏదైతే చెప్పాలనుకున్నానో.. అది వేరేలా కమ్యూనికేట్ అవుతూవుంటుంది. ఒక్కటి మాత్రం నిజం.. జనాభిమానాన్ని పొందిన నటిగా నేను ఏం మాట్లాడినా దానికి విస్తృతమైన ప్రచారం లభిస్తుంది. ఈ కారణం చేతే పలు సందర్భాల్లో విమర్శలు ఎదుర్కోవాల్సివచ్చింది. అందుకే.. సరిగ్గా మాట్లాడే నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉంది' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి.

బాణాలకు నెత్తుటి తానాలు పోయాలి..



అగ్ర కథానాయిక రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మైసా'. స్త్రీశక్తిని, మహిళా సాధికారతను చాటిచెప్పే స్ఫూర్తివంతమైన కథాంశంతో రూపొందిస్తున్న ఈ చిత్రంలో గోండ్ తెగకు చెందిన గిరిజన అమ్మాయి పాత్రలో కనిపించనుంది రష్మిక మందన్న. ఈ చిత్రానికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో సోమవారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుడుతూ 'ఓ మైసా రే' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరచిన ఈ పాటను సుద్దాల అశోక్‌తేజ రచించారు. సింధూజ శ్రీనివాసన్ ఆలపించారు.'శత్రువుల కుత్తుకపై కత్తులనే నూరాలి రా.. బాణాలకు నెత్తుటితో తానాలు పోయాలిరా' అంటూ సాగిన ఈ పాటలో మైసాను ఈషి, ఐషి రూపాల్లో ఆవిష్కరించారు. స్త్రీ తాలూకు దైవిక శక్తినీ, ధైర్యసాహసాలను ఈ గీతం ప్రతిబింబించింది. అటవీ నేపథ్యంలో వందలాది డ్యాన్సర్లతో తెరకెక్కిన ఈ పాటలోని విజువల్స్ కూడా హైలైట్‌గా నిలిచాయి. ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com